క్లుప్తంగా

సంత్ రవిదాస్ జయంతి



జయంతి నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద: సోన్ మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతి ఘనంగా నిర్వహించారు. కులరహిత సమాజం కోసం పాటుపడిన మహనీయుడి అడుగుజాడల్లో నడవాలని సాగర్ పేర్కొన్నారు. బీజేపీ సోన్ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ముత్యం, సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీణ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్తా ధర రూ.270 అని.. సోమవారం నుంచి పంపిణీ చేస్తామని కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయం వద్దకు రావాలని వారు పేర్కొన్నారు.

బురద తొలగింపు



బురదను తొలగిస్తున్న గంగపుత్రులు

భైంసా: బాసర గోదావరి నదిలో మొదటిఘాట్ వద్ద బురద నిండిపోయింది. దీంతో పుణ్యస్నానం చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా బాసర గంగపుత్ర సంఘం సభ్యులు ఆదివారం నదిలో మొదటిఘాట్ వద్ద బురదను స్వచ్ఛందంగా తొలగించారు.

నేడు బీజేపీ సమావేశం

ఖానాపూర్: బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాయిని సంతోష్, దేశాయి రాము తెలిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్‌తోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారన్నారు. పదాధికారులతోపాటు సీనియర్ నాయకులు, మోర్చాల నాయకులు హాజరు కావాలని కోరారు.

అలరించిన వార్షికోత్సవం



ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవం అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, జానపద నత్యాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను సత్కరించారు. క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వశిష్ఠ విద్యాసంస్థల అధ్యక్షుడు వి.సత్యనారాయణగౌడ్, కార్యదర్శి సరోత్తంరెడ్డి, అధ్యాపకుడు సత్యపాల్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్, ప్రిన్సిపాల్ ఎల్.మహేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేశ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'అక్కకొండ' బ్రహ్మోత్సవాలు

కడెం: మండలంలో కొండగుహలో కొలువుదీరిన అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. జాతర, రథోత్సవంలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు.



లక్ష్మీనరసింహస్వామి

ఊపందుకున్న రోడ్డు విస్తరణ పనులు

ఖానాపూర్: పట్టణంలో రూ.కోట్లాది రూపాయలతో ఏడాది కాలంగా నత్త నడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు నెలరోజులుగా ఊపందుకున్నాయి. 15 రోజుల వ్యవధిలోనే సుమారు కిలోమీటర్ మేర సైడ్ డ్రైన్ నిర్మించారు. రెండు పొక్లెయిన్లతో ఓ వైపు రోడ్డు అభివృద్ధి పనులు సైతం వేగంగా చేస్తున్నారు. కాగా రోడ్డుపై వస్తున్న దుమ్ముధూళితో పట్టణవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. దుమ్ము లేవకుండా కాంట్రాక్టర్‌తో రోడ్డుపై నీటిని చల్లేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయల సాగుతో ఉపాధి

- ప్రగతిబాటలో నగర్‌తండా వాసులు
- మంచి ఆదాయం గడిస్తున్న వైనం
- పశుపోషణలోనూ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామస్తులు



పందిరి విధానంలో సాగు



టమాటా సాగు

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండాలో ఆధునిక పద్ధతుల్లో సీజన్‌ల వారీగా కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఎక్కువ మంది సన్నకారు రైతులు కావడంతో పండించిన కూరగాయలను దళారులకు విక్రయించకుండా.. సమీపంలోని సంతలు, మార్కెట్‌లోకి తీసుకెళ్లి నేరుగా వినియోగదారులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో తాము పడిన కష్టానికి మద్దతు ధర లభిస్తుందని తండావాసులు పేర్కొంటున్నారు.

కూరగాయలు, పాలు అమ్ముకుంటూ జీవనం..

లోకేశ్వరం మండలంలోని నగర్ పంచాయతీ పరిధిలో నగర్‌తండా గ్రామంలో కూరగాయలు, పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామ జనాభా 370 మంది. 284 ఎకరాల్లో పంటలు పండిస్తుండగా అధికశాతం మంది సీజన్ల వారీగా కూరగాయలు సాగు చేసి విక్రయం సాగిస్తున్నారు. సమీపంలో ఎక్కడ సంత జరిగినా ఈ తండావాసులే 10 మంది వరకు కూరగాయలు విక్రయిస్తారంటే అతిశయోక్తి కాదు.

అధునాతన పద్ధతుల్లో సాగు..

ఇక్కడి రైతులు మూస ధోరణిని వదిలిపెట్టి..అధునాతన పద్ధతుల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. పందిరి సేద్యం, మల్చింగ్ విధానం పాటిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను కూడా వినియోగిస్తున్నారు.

మార్కెట్‌కు తీసుకెళ్తున్న పురుషులు..

తీగజాతికి చెందిన బీర, కాకర, చిక్కుడు, సోరకాయతోపాటు టమాట, వంకాయ, మిర్చి, క్యాబేజీ, ఆరుగోబి, గోరుచిక్కుడు, కొత్తిమీర, మెంతి, పాలకూర, ఉల్లి కూడా సాగు చేస్తారు. పురుషులు తెంపిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. రోజువారీగా చేతికి డబ్బు రావడంతో పొదుపు చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. తమ పిల్లలకు సైతం ప్రైవేటులో మంచి చదువులు చెప్పిస్తున్నారు.



నగర్‌తండా గ్రామం

ఇంటికో గేదె, లేదా ఆవు..

ఏడేనిమిదేళ్ల కిందట కరువు వచ్చినప్పుడు ఈ గ్రామస్తులు పూట గడవక ఇబ్బంది పడ్డారు. దీంతో పాల వ్యాపారం కోసం ఇంటికో గేదె లేదా పాడిఆవును తెచ్చుకొని పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఒక్కో ఇంటి నుంచి మూడు నుంచి నాలుగు లీటర్ల వరకు పాలను నగర్‌లోని విజయ డెయిరీ కేంద్రానికి పోస్తున్నారు. మళ్లీ ఇంటికొచ్చి వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. ఖర్చులు పోనూ ఒక్కో రైతు రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం ఈ తండా నుంచే రోజుకు 100 లీటర్లకు పైగా పాలను విజయ డెయిరీకి పోస్తున్నారు.



పాలు పితుకుతున్న తండా రైతు

అమ్మేందుకు అవస్థలు..

కూరగాయలు అమ్ముకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. అబ్దుల్లాపూర్, నర్సాపూర్(జి) సంతలో సౌకర్యాలు లేక రోడ్లపైనే విక్రయిస్తున్నామని వాపోతున్నారు. అయినప్పటికీ తైబజార్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారని.. ఇవ్వకుంటే కూరగాయల ముల్లెలను తీసుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరెకరంలో పండిస్తాం



మాకున్న అర ఎకరం భూమిలో వివిధ రకాల కూరగాయలు పండిస్తాం. దళారుల కు అమ్మకుండా నేరుగా ఉదయం సమీపంలోని మార్కెట్, సంతలకు తీసుకెళ్లి అమ్ముతున్నం. అవసరమున్నవారు తోటల వద్దకే వచ్చి కొంటున్నారు. – మనీషబాయి, నగర్‌తండా

నేరుగా మార్కెట్‌లోనే విక్రయిస్తున్నాం



మేము పండించిన కూరగాయలను దళారులకు అమ్మకోం. సాయంత్రం కూరగాయలు తెంపి ఉదయం మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నం. పెళ్లిళ్ల సీజన్‌లో కొత్తిమీర, పుదీనాకు మంచి రేటు వస్తుంది. రోజుకు రూ.500కు పైనే ఆదాయం వస్తుంది.
– పుష్పబాయి,నగర్ తండా

ఊరూరా తిరిగి విక్రయిస్తున్నా



వారసంతలతోపాటు ఊరూరా తిరిగి కూరగాయలు విక్రయిస్తున్నా. దీంతో చేతినిండా డబ్బు ఉంటుంది. మళ్లీ తోట వద్దకు వెళ్లి కూరగాయలను మరుసటి రోజుకు సిద్ధం చేస్తాం. ఇతర పంటలు చేసి నష్టపోయే కంటే కూరగాయల సాగు బాగుంది. – ప్రకాశ్, నగర్‌తండా

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : మైఖేల్
నారాయణ : ధమాకా
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

భీమన్న గజాలకు గంగస్నానం

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో భీమన్న దేవుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెంబి మండలంలోని పలు గ్రామాల భక్తులు భీమన్న గజాలతో ఖానాపూర్‌లోని గోదావరి నదీ తీరానికి చేరుకున్నారు. ఈసందర్భంగా భీమన్న దేవుని గజాలకు గంగస్నానం చేయించారు. అనంతరం ఖానాపూర్‌లోని పలు నివాసాల్లో దేవుని గజాలతో పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువగా పునఃప్రతిష్ఠాపన

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ వేంకటలక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పండితులు నరసింహమూర్తి, రాజశేఖరశర్మ బృందం ఆధ్వర్యంలో కర్మణ పుణ్యాహవచనం, గర్త సంస్కారం, స్థిరయంత్రమూర్తి ప్రాణప్రతిష్ఠం, ప్రతిష్ఠాపన హోమాలు, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం తోపాటు వెంకటలక్ష్మి నరసింహస్వామి శాంతి కల్యాణం కనుల పండువగా జరిపారు. అనంతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేపట్టారు. శనివారం రాత్రి సామూహిక కుంకుమార్చనల్లో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నాందేడ్‌కు బీఆర్‌ఎస్ నాయకులు



నిర్మల్‌లో సభకు వెళ్లే ముందు నాయకులు



సభ ప్రాంతం వద్ద కుభీర్ మండల నాయకులు

నిర్మల్‌టౌన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం సీఎం కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభకు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్మల్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఇందులో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని నాయకులు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, గణేశ్, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు నాందేడ్ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ చవాన్ అల్కాతాయి, ఏఎంసీ చైర్మన్ గంగాచరణ్, మోహినొద్దీన్, కుభీర్ సర్పంచ్ మీరా, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, నాయకులు విజయ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: నాందేడ్ సభకు వెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు, సర్పంచ్‌లు శేఖర్ రెడ్డి, నరేశ్ ఉన్నారు.

తానూరు: నాందేడ్ సభకు ప్రత్యేక వాహనాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు వెళ్లారు. ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్, కార్యకర్తలు ఉన్నారు.

కుంటాల: కుంటాల మండలం నుంచి నాందేడ్ సభకు వెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, ప్రదీప్‌కుమార్, గజ్జారాం, వెంకటేశ్, సర్పంచులు తదితరులు ఉన్నారు.

ముగిసిన మల్లన్న జాతర



బోనాలతో ఆలయం వద్దకు వెళ్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో మల్లన్న జాతర ఆదివారం ముగిసింది. చివరిరోజు భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ ఇంద్ర, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి ఉన్నారు.

గ్రామదేవతల వార్షికోత్సవం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, చిలకచిన్నమ్మ గ్రామ దేవతల ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా బోనాలతో వెళ్లిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లన్న, ఉప సర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, వీడీసీ సభ్యులు గంజాల గంగాధర్, పీరు పటేల్, నాగన్న, మహేశ్, రవి, పోశెట్టి ఉన్నారు.

19న భూమిపూజ

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ రోడ్డు శివాజీచౌక్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఈనెల 19న భూమిపూజ నిర్వహించనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విగ్రహ నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూవాహిని భైంసాశాఖ పిలుపునిచ్చింది.

ఘనంగా పెద్దమ్మ జాతర



అగ్నిగుండం నుంచి దాటుతున్న భక్తులు

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జాతరకు చుట్టుపక్కన ప్రాంతాల ప్రజలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో సందడిగా మారింది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన ఓ భక్తుడు భక్తులకు అన్నదానం చేశారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కల్యాణం.. కమనీయం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 32వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలకు వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణం తిలకించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్నదేవుని కళ్యాణం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మల్లన్నదేవుని జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి మల్లన్న దేవుని కల్యాణం వైభవంగా జరిపించారు. ఆదివారం ఎడ్‌బిడ్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆలయ ప్రాంగణానికి చల్లని అంబలితో వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నారు. జాతరకు భైంసా ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.



ముధోల్: సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు

లక్ష్మణచాంద: సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిపారు. అంతకుముందు ఆశ్రమ వ్యవస్థాపకులు రామానందస్వామి స్వామివారికి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్ఠించి వీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పలకీసేవలో పాల్గొన్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో ఆది వారం సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాయిబాబా, శివలింగం, దత్తాత్రేయ, వినాయక, నంది విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పూజారులు విష్ణుస్వామి, రమణస్వామి భక్తులకు పుణ్యవచనం బోధించారు. బాబాహారతి అనంతరం గ్రామానికే చెందిన రైతు రాజు సహకారంతో అన్నదానం చేశారు. స్త్రీవైద్య నిపుణులు స్వర్ణారెడ్డి, సర్పంచ్ పద్మ, ఉపసర్పంచ్ రమేశ్, లక్ష్మి, గంగాధర్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గజ్జలమ్మ ఆలయంలో సందడి

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మహారాష్ట్రలోని బోకర్, ధర్మాబాద్, అప్పారావుపేట, మాలక్‌జాం, శివుని ప్రాంతాల భక్తులు వచ్చి గజ్జలమ్మతోపాటు ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు హుండీ ఆదాయం లెక్కించారు. పలువురు గజ్జలమ్మ దీక్షాపరులు గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో మాలవితరణ చేశారు.